# జీవశ్చవం

~ హరికృష్ణ తాటిపాముల

K.R. Publications

K.R. Publications

**JEEVACHAVAM**

**By** Harikrishna Thatipamula

@Kaliyugakavi02 **Ph** : 9603208870

**Email Address** : harikrishnagoud1111@gmail.com

**Copy Right** @ : Author

**First Edition :** April 2026

**Copies :** 500

**ISBN :** 978-81-980171-7-8

**Price :** 179/-

**Cover Design** : Rahul Roy

**Book Editing & Lay-out** : Gayatri Mullapati

**For Copies Contact :** K.R. Publications, Plot no.87, Road no. 11 Kranthi Nagar, Bachupally – 500090

**Ph :** 8464045427

**Website** : https://www.krpublications.org/

**Printed At** : Sai Tirumala Printers

No part of this publication may be reproduced, distributed, or transmitted in any form or by any means, including photocopying, recording, or other electronic or mechanical methods, without the prior written permission of the author. This book is a work of fiction. Names, characters, businesses, places, events, and incidents are either the products of the author's imagination or used fictitiously. Any resemblance to actual persons, living or dead, or actual events is purely coincidental.

# ముందుమాట

నన్ను ఇలా మీ అందరి ముందుకు తీసుకొచ్చిన కే.ఆర్. పబ్లికేషన్స్ కి ముఖ్యంగా కే.ఆర్. అన్నకి, ఎడిటర్ గాయత్రి ముళ్ళపాటి గారికి, ఆర్టిస్ట్ రాహుల్ కి ముందుగా నా థాంక్స్...

క్రికెటర్ అవుదామనుకుని కొన్ని సంవత్సరాలుగా రోజూ కష్టపడుతూ, శిక్షణ పొందుతూ, చాలా మందితో తిట్లు తింటూ, క్రికెట్ మీద ఉన్న ఆసక్తితో అవసరమైనప్పుడల్లా దాదాపు 150 కిలోమీటర్లు ప్రయాణిస్తూ తాలూకా స్థాయి, హైదరాబాద్ లీగ్ స్థాయి వరకు ఆడి ఆటలో ఊపుగా ముందుకు కొనసాగుతున్న క్రమంలో, హఠాత్తుగా సంభవించిన 2019 లాక్ డౌన్ నా క్రికెట్ ప్రయాణాన్ని అగమ్యగోచరం చేసింది.

నాదే కాదు చాలా మంది జీవితాలు అలానే అర్ధాంతరంగా ఆగిపోయాయి. మళ్ళీ రెండు సంవత్సరాల తర్వాత తిరిగి మొదలుపెట్టి ఆడినా హైదరాబాద్ క్రికెట్ లో నాకు సరైన న్యాయం జరగలేదు, నా విషయంలోనే కాదు అక్కడ నాతోపాటు శిక్షణ పొందిన స్నేహితుల విషయంలోనూ ఇలాగే జరిగింది.

**బహుశా** అందుకేనేమో హైదరాబాద్ క్రికెట్ ఇంకా అనుకున్నంత వృద్ధి సాధించట్లేదు. లీగ్ స్థాయి నుండే ఔత్సాహికుల వద్దనుండి నమ్మించి, వేలకు వేలు డబ్బులు తీసుకొని ఎంతో మంది మంచి మంచి ఆటగాళ్ళను పాతాళానికి తొక్కేసారు. ఇప్పటికీ తొక్కేస్తున్నారు కూడా. మీరు కూడా చాలా సార్లు హైదరాబాద్ క్రికెట్ గురించి చదివే ఉంటారు. నేను కాస్త దగ్గరగా చూసానంతే! అలా అని నిరుత్సాహంతో నేను ఆటను ఆపలేదు, దానిపట్ల ఉన్న మక్కువను కోల్పోలేదు. ఆడుతూనే ఉన్నాను.

ఇక ఈ పుస్తకం విషయానికి వస్తే, లాక్ డౌన్ వల్ల ఎక్కడైతే నేను ఆగానో అక్కడే మొదలయింది ఈ నా కొత్త సాహితీ ప్రయాణం.

మా బావ (అక్షయ్) పుస్తకాలపురుగు. రచనల విషయంలో అయితే మంచి సలహాదారుడు కూడా! లాక్ డౌన్లో ఏం తోచక మా అక్కాబావల దగ్గరి నుండి పుస్తకాలు తెచ్చుకుని చదవడంతో, నాకూ ఇదో ఉత్తమ వ్యసనమైపోయింది.

అలా పాఠకుడిగా మొదలైన ప్రయాణం ఇలా పుస్తకం రాయడం దాకా వచ్చింది. ముఖ్యంగా నాకు పాటలు రాయడం ఇష్టం. సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు దైవ సమానులు. ఆయన పాటలు వినడం వల్లే, ఆ స్ఫూర్తితో కలం పట్టుకుని ఇలా పుస్తకం రాసే స్థాయికి చేరాను. అవకాశం కలిగితే ఒకరోజు మంచి గీత రచయితనై (**lyricist**)గా మిమ్మల్ని మెప్పించే ప్రయత్నం చేస్తాను.

# కృతజ్ఞతలు..

మా అమ్మ నాన్న లకి, పెద్దక్క గీత, అశ్విని, తమ్ముడు రామకృష్ణ, సపోర్ట్ చేసిన మా బావలిద్దరికీ చాలా థాంక్స్.

మరియు నా స్నేహితులు మాణిక్, అప్పి, అశోక్, రాక్ రాజు, కరీంనగర్ సతీష్ అన్నకి కూడా ఈ సందర్భంగా థాంక్స్ చెప్పుకుని తీరాలి.

****

# అమ్మ చెప్పిన కథ

"రోజూ ఏంటమ్మా, ఇంటి ముందు ఆ ఏడుపులు, చిరాగ్గా ఉంటుంది నాకసలు, అయినా ఆ పెద్దావిడ ఎవరమ్మా పిచ్చిపిచ్చిగా తనలో తను మాట్లాడుకుంటుంది. ఇంకా ఆ ఏడుపొకటి చిరాకేస్తుంది."

"కార్తీక్ అలా అనకూడదు 'పిచ్చి' అని"

"మరేమైందమ్మా తనకి"

"వాళ్ళ అబ్బాయి పేరు రమణ. అదే గుడిసెలో వాడూ వాళ్ళమ్మా అంటే ఇప్పుడు ఏడుస్తోంది చూడు ఆవిడ, కలిసి ఉండేవాళ్ళు. అప్పుడు వాడి వయస్సు పదహారు పైమాటే. రమణని చాలా బాగా చూసుకునేది వాళ్ళ అమ్మ.



ఆవిడ పేరు ముత్యాలమ్మ. రమణ తల్లి. తండ్రి రోజువారి కూలీ పని చేసుకుంటూ రమణని చదివించేవాడు. అయితే రమణ వాళ్ళ నాన్న అతని చిన్నప్పుడే చనిపోయాడు. వాళ్ళ అమ్మ ఎంత బాగా చూసుకున్నా వీడు చిరాకు పడేవాడు. తను ఒక పూట తింటూ వాడికి మూడు పూటలా భోజనం పెట్టేది. ఎవరిని అడుక్కునే తత్వం కాదు ఆవిడది. అలా కష్టపడుతూనే వాడిని పెంచుకుంది."

"వాడప్పుడు పదో తరగతి అనుకుంటా, రాత్రి చాలా ఆలస్యం అయ్యింది. వాడు ఇంటికి రాలేదు. రాత్రి 11 గంటలు కావస్తుంది. అప్పుడు ఇంటికి వచ్చాడు. వాడు మామూలుగా రాలేదు. అడుగులు తడబడుతూ, కళ్ళు మసకబారగా తడుముకుంటూ వచ్చాడు. వాడి చొక్కా చివరి మూడు గుండీలపై నిలిచింది. వాడారోజు బాగా తాగి వచ్చాడు. ఆ తల్లి కళ్ళు చెమ్మగిల్లాయి. వాడు మాట్లాడలేని పరిస్థితిలోఉన్నాడు, ఒకట్రెండు మాటలు నోటి నుండి దుర్వాసనతో ముద్దగా వచ్చాయి. అలాగే వచ్చి నవారు మంచంపై వాలిపోయాడు. ముత్యాలమ్మ కూడా ఏడుస్తూ అలానే నేలకు ఒరిగింది"

"పొద్దున్నే రమణ లేచాక – 'ఏంటి నాన్నా, నువ్వెప్పుడు ఇంటికి తాగి రాలేదు. నిన్న ఎందుకు అంతలా తాగొచ్చావ్. ఎవరు తాగించారు? అలా తాగి రావడం తప్పు" అని మందలించింది ముత్యాలమ్మ.

"నీకెందుకే లంజముండా!" అనేసాడు రమణ.

కన్నతల్లి గుండె గునపంతో గుచ్చినట్టు బీటలువారింది.

"నేను నీ తల్లిని నాన్నా, ఎందుకిలా మాట్లాడుతున్నావు, నువ్వు మునుపెన్నడు ఇలాంటి మాటలు మాట్లాడలేదు"

"ఇకనుండీ మాట్లాడతా.."

"అలా అనొద్దురా" అనగానే..

ముత్యాలమ్మ ఛాతిపై గట్టిగా తన్ని బయటికి వెళ్ళిపోయాడు.

అయ్యో పాపం ఆ తల్లి.

"వాడికి ఎవరు నేర్పుతున్నాడో ఏమోగాని ఆ రోజు నుండి, వాడి ప్రవర్తనకి ఆ తల్లి పడే బాధ వర్ణనాతీతమయ్యింది. వాడు చదువుని పూర్తిగా వదిలేసాడు. ఆవిడని ఎంత తిట్టినా, కొట్టినా వాడిని ఒక్కమాటా అనేది కాదు. పైగా 'నన్ను తిట్టు, కొట్టు కాని, ఒక్క ముద్ద తిని పడుకో అయ్యా' అని కంచం పట్టుకుని బతిమిలాడేది ముత్యాలమ్మ.

ఆ మాటలు విన్నాక నా కళ్లెమ్మట నీళ్లు ఆగలేదు. అమ్మ నన్ను దగ్గరికి తీసుకొని, మిగతా విషయాలు చెప్పడం కొనసాగించింది.

"అయితే ఇదంతా నేను రోజూ గమనించేదాన్ని. ఒకరోజు వాళ్ళింటికి వెళ్ళాను. తను అంత బాధలో ఉన్నా కూడా ముత్యాలమ్మ 'కూర్చోండి' అంటూ నా కోసం ఒక కుర్చీని వేసింది.

ఆ కుర్చీ పరిస్థితి ఎలా ఉందంటే, రెండు విరిగిన కుర్చీలను ఒక దగ్గరకి చేర్చి నూలు దారంతో కట్టినట్టుంది. ఆ కుర్చీని చూస్తేనే బాధ కలిగింది.

'పర్లేదమ్మా' అన్నా వినలేదు.

తను కింద కూర్చుంది.

"మీ వాడున్నాడా?" అని నేను అడగ్గానే–

"వాడేదో పని మీద బయటికి వెళ్ళాడమ్మా. మా అబ్బాయి చాలా మంచోడు, నా బంగారు తండ్రి వాడు" అంది ముత్యాలమ్మ.

"నీ నుదుటిపై బొడిపెలా వచ్చిందమ్మా!"

"చిన్న ఇల్లు కదా, పైన ద్వారానికి ఉన్న కొంకె తాకింది" అంది.

"మరి ఆవిణ్ని నువ్వు అడగలేదా అమ్మ, నీకు తెలుసుకదా ఏం జరిగిందో!"

"అడిగి నేను బాధ పెట్టలేకపోయాను నాన్నా, అయినా నేను జరిగేది రోజూ చూస్తాను, పాపం తను ఒక్క విషయం కూడా బయటికి చెప్పుకోదు."

ఆ తర్వాత ముత్యాలమ్మతో "సరే, నేను వెళ్ళొస్తాను" అని చెప్పి బయటికి వచ్చాను.

“అయ్యో తల్లీ, కొంచెం చాయి తాగి ఎల్లమ్మా” అంది ముత్యాలమ్మ.

“పర్లేదు” అన్నా వినలేదు.

ఆ చిన్న కిరోసిన్ పొయ్యిపై టీ పెట్టి పైన దూలాన ఉన్న మంచి కప్పు తీసి టీ ఇచ్చింది.

"తన పరిస్థితి చూసి నేనసలు తట్టుకోలేకపోయా నాన్న. తను అలా ఎలా ఉంటోందోనని."

తరువాత అడిగింది “ఏమైనా పనా అమ్మా ఇలా వచ్చారు? ఇలా అడిగానని తప్పుగా అనుకోకమ్మ” అంది ముత్యాలమ్మ.

“అయ్యో పర్లేదు అడగడంలో తప్పేముంది. సరే వెళ్ళొస్తాను.”

“అలాగే అమ్మా”

బయటికి వచ్చి నిల్చుంది. నేను వెళ్తూ అలా ప్రక్కకు చూసా.

“ఎందుకమ్మా అలా చూసావ్” అన్నాను. అమ్మ నా వైపు చూసింది. ఆవిడ కళ్లనిండా నీళ్ళు. ఆవిడ నోరు తెరిచి ఏం చెప్పలేదు, కన్నీళ్ళే విషయం చెప్పాయి.”

“అయ్యో ఘోరం అమ్మ!”

తరువాత ఒక రోజు ఆ ఇంట్లో నుండి ఏడుపులు వినిపించాయి రాత్రి 12 కావొస్తుంది. మళ్ళీ ఏమైందోనని బయటికి వెళ్ళి చూసా. ముత్యాలమ్మ ఏడుస్తూ కనబడింది. రోజు ఇలానే ఉంటుంది కదా, నేనుమాత్రం ఏం చేస్తానని వెళ్ళి పడుకున్నా. మళ్ళీ అలానే పెద్దపెట్టున ఏడుపులు వినిపిస్తున్నాయి. ముత్యాలమ్మ బయటికొచ్చి ఏడుస్తోంది.

“ఒరేయ్ నాన్న ఇంటికి రారా! నేను ఇంట్లోనే ఉంటున్నా నాన్న. నువ్వు నన్ను ఎంత కొట్టినా, నేను బయటకి చెప్పను. నన్ను వచ్చి చంపెయ్, నిన్ను చూడంది నాకు నిద్ర కూడా పట్టదు.” అని ఏడుస్తూ అరుగుపై కూర్చుంది ముత్యాలమ్మ.

నేను వెళ్ళి “ఎందుకు ఏడుస్తున్నావు ముత్యాలమ్మా” అని అడగంగానే

“ఏమో అమ్మా, రమణ ఇంకా రాలేదు.” అని ఏడుస్తూ చెప్పింది.

"వస్తాడు ముత్యాలమ్మ ఏం కాదులే వెళ్ళి పడుకో" అనగానే. ఇంట్లోకెళ్ళి పడుకుంది.

పొద్దున్నే వెళ్ళి చూస్తే, ఇంట్లో ఓ మూలన కూర్చొని అలానే ఏడుస్తుంది.

"ఏంటి ముత్యాలు, ఇంకా మీవాడు రాలేదా?" అనగానే–

"లేదమ్మా" అని చెప్పింది.

"తరువాత ఏం జరిగిందమ్మా?"

"అదే రోజు సాయంత్రం నాలుగవుతోంది, పోలీసులు వచ్చారు. అంబులెన్స్ లో ఆ అబ్బాయి శవాన్ని పట్టుకొచ్చారు."

"ముత్యాలమ్మా, మీ అబ్బాయి రాత్రి తాగి రోడ్డు మధ్యలో నడుస్తుంటే లారి ఢీకొని చనిపోయాడు." అని కానిస్టేబుల్ చెప్పాడు.

ముత్యాలమ్మ ఏడుపును చూసి వీధి వీధంతా ఏడ్చారు. వాడి శవానికి గ్రామ పంచాయితీ సాయంతో అంత్యక్రియలు జరిపించారు.

"ఇది జరిగి దాదాపు పదిహేను సంవత్సరాలు అవుతోంది. అప్పటినుండి గుర్తొచ్చినప్పుడల్లా ఇలా రోజూ ఏడుస్తూనే ఉంటుంది. ఇదీ జరిగిన విషయం"

"అయ్యో పాపం"

"అలా తెలియకుండా పిచ్చిది, పిచ్చోడు అని అస్సలు అనకూడదు నాన్న"

"నన్ను క్షమించమ్మా"

"కార్తీక్ నువ్వు అలా ప్రవర్తించి నన్ను బాధ పెట్టవుగా నాన్న"

"నాకు ఆ ఆలోచన వచ్చే ముందే నా ప్రాణం గాల్లో కలుస్తుందమ్మ"

"నన్ను బాధ పెట్టడం మాట అటుంచి, నువ్వు మాత్రం తాగడం, అబద్ధాలు ఆడటం నేర్చుకోకు. ఎట్టి పరిస్థితులలోనూ నిజాయితీగా బతుకు చాలు" అంది.

***

# రాక్ రాజు

నా పేరు కార్తీక్. వయస్సు18. ఇప్పుడిప్పుడే నా మనసు వికసిస్తోంది. నా ఉద్దేశ్యం, వయసు యవ్వనాన్ని పులుముకుంటోంది. 100 మీటర్లకొకసారి మనసు ఆగిపోతుంది. ఎందుకంటే, నేను నడిచేది కాలేజీ వీధుల్లో. మేలి మనసు నాది మరియు (Male మనసు). ఈ మనసును చదువుపై పెట్టమని చెబుతూ ఒత్తిడి చేస్తూ ఉంటాడు మా నాన్న. అందరి నాన్నల్లానే.

ఉదయం 6 గంటలకి నా కాలేజ్ బస్సు. ఆ కాలేజ్ బస్సు వచ్చే పది నిమిషాల ముందే మా నాన్న సైకిల్ పై నన్ను తీసుకొచ్చి, బస్ వచ్చాక బస్సులో కూర్చోబెట్టి వెళ్ళిపోతాడు. మా నాన్న రోజూ వెళ్ళిపోయే ముందు నేను ఒక నవ్వు నవ్వాలి లేకపోతే అదో అనుమానం. చెప్పడం మరిచిపోయా మా నాన్న పేరు 'శివయ్య.'

అబ్బా! రోజూ బస్సులో ఏదో గోల ప్రతీ సీటుకి ఇద్దరు. ఒకటి మేలి మనస్సు మరొకటి మేలి మనసును మెలిపెట్టే మనసు. (M&F) ఒక అమ్మాయి ఒక అబ్బాయి.

నాకు ఈ బస్సు ఎక్కితే లుంబిని పార్కులోకి వెళ్ళినట్టు ఉంటుంది. నా ఉద్దేశ్యం ఇందులో దాదాపు అన్ని ప్రేమ పక్షులే. మళ్ళీ వీళ్ళ మధ్యలో తిరిగి తిరిగి నేనెక్కడ ప్రేమలో పడతానన్న భయం నాకు. ఆ భయం వెనకాల ఉన్న కారణం. మా నాన్న.

మా నాన్న నాకు ముందే చెప్పాడు ''ప్రేమలాంటివి ఎలగబెట్టేముందు మన ఇంటిముందు ఉన్న వెదురు కర్రను గుర్తుతెచ్చుకో' అని చాలా పద్ధతిగా చెప్పాడు.

ఇక చివరి సీటులో కూర్చుంటూ కిటికీలోంచి చూస్తున్నాను, చేతి వేళ్ళు అలా ఊపుతూ 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలో ప్రకాష్ రాజ్ లా ఓ నవ్వు నవ్వుతూ వెళ్ళిపోయాడు మా నాన్న.

బస్సు కదలగానే నా ముందు నడుస్తున్న పోస్టర్ల సినిమాలని చూస్తూ కాలేజీ వరకు కాలక్షేపం చేస్తా. బస్సు దిగగానే దిక్కుమాలినోడిలా దిక్కులు చూస్తూ నా

దిక్కు ఒకడు చూస్తాడు, ఆ దిక్కుని నేను వెతుక్కోవాలి. అదిగో మూత్రశాల దిక్కు ఉన్నాడు.

"ఏరా ఎదవ నీకు నిలబడడానికి చోటే దొరకలేదా ఈ కంపులో నిలబడ్డావ్?"



'ఇక్కడ నుండి చాలా దగ్గరగా స్పష్టంగా కనబడుతున్నారు మామ మనల్ని మెలితిప్పే మనషులు, అహ.. నువ్వు ఊరికే అంటావుగా మెలితిప్పే మనషులు అని అందుకే ఓ డాగ్ చేసా నీలా.."

"తూ.. ఎదవ"

వీడు నా స్నేహితుడు కొండ రాజు. స్టైల్ గా ఉంటుందని నేనే 'Rock Raju' అని పేరు మార్చా, ఈ పేరు పెట్టడానికి ఇంకో కారణం కూడా ఉంది. యాధృచ్చికంగా జరిగిన ఓ సంఘటన.

వాళ్ళ ఊర్లో ఓ బండరాయి, దానిపై ఈ కొండ రాజు, రోజూ నిల్చొని రోడ్డు మీదకు ఓ బైనాక్యులర్ తో వాళ్ళ క్లాసు అమ్మాయిని చూడటానికి, అక్కడికి చేరేవాడు. స్కూలు మారడంతో వాడికి ఈ తిప్పలు రోజూ మాములు అయిపోయాయి. అలా సాయంత్రం 4 కాగానే. ఆ కొండ దగ్గర బండరాయి ఎక్కాలి, తనని చూడాలి.

అలా చూసి చూసి తనని ఓసారి మాట్లాడిద్దామని వెళితే, ఆ రోజే వాళ్ళన్నయ్య వచ్చాడు వెనకాల నుండి. వాడు ఎద్దుకి తక్కువ పందికి ఎక్కువ అన్నట్టు ఉన్నాడు. దగ్గరికి వచ్చి మనోడి చొక్కా నలిపేసాడు.

అయినా మనోడు ఊరుకోలా. రోజులానే అదే వరస. కాని ఒకరోజు తను కనబడలేదు, రెండో రోజు కనబడలేదు, అయినా మనవాడి ప్రయత్నం ఆగలేదు. అలా పది రోజులు అవుతుంది తనని వాడు చూడక. కానీ చివరికి చూసాడు. చాలా దగ్గర నుండి తను సుమోలో కూర్చుంది ప్రక్కన ఎవడో కూర్చున్నాడు. ముందు అందరూ డాన్స్ చేస్తున్నారు.

"ఇంకేముంది పదరా రాజు ఇంటికెళదాం నువ్విక కష్టపడాల్సిన పనిలేదు"

"ఇంత చిన్న వయసులో పెళ్ళి ఏంటిరా కార్తీక్ తనకి."

అలా అదే రోజు వాడి గుండె బండ అయింది. వాడి పేరుకి, వాడి జీవితంలో జరిగిన ఈ చిన్న సంఘటన కారణమైంది.

''కళాశాలలో ఓ.. కళాశాలలో ఓ..' పాట పాడుతూ ఎంటర్ కాగానే కనబడింది భయ్యా ఓ పిల్ల ఏముంది తెల్సా!'

ఆ పిల్ల కళ్ళు చూస్తే నల్లని స్కార్ఫ్ కిటికీలోంచి తొంగి చూసే పిల్లి కళ్ళలా ఉన్నాయి, అంటే అందంగా ఉన్నాయని అర్ధం భయ్యా. అంతే ఇక వర్ణించడానికి ఏమి లేదు. తన పేరు 'మెరీనా' ఇలాంటి పేరు కలిగిన అమ్మాయిలంతా ఈ విధంగానే ఉంటారు. నా ఉద్దేశ్యం ముస్లిం అమ్మాయి అని.

అసలు ఆ కళ్ళు ఎంత పద్ధతిగా ఉన్నాయో చూస్తుంటే నాకు ఈ ప్రపంచం ఎందుకో చాలా చిన్నగా కనబడుతుంది.

"ఒరేయ్ బట్టేవాజ్ కింద కొట్టుకుంటున్నారు చూసినవా?" అని రాజు అన్నాడు.

"అయితే నాకేంటి బే.."

"కాదు నువ్వు వాళ్ళల్లో భాగం అవుదామనుకుంటున్నావా?" అన్నాడు రాజు.

"నేనెందుకు అయితా మామా వాళ్ళతో.." అన్నాడు కార్తీక్.

"వాళ్ళు ఆ పిల్ల గురించే కొట్టుకునేది. చూసినవా ఎట్లున్నరో ఉల్లిగడ్డ నలిపినట్లు నలుపుతారు నిన్ను." అన్నాడు రాజు.

“అలాగే మా నాన్న కూడా ఇంటి దగ్గర కట్టెలతో ఎదురుచూస్తడు. అయినా మనకెందుకురా ఈ అమ్మాయిలు లవ్వు, గివ్వు ఎక్స్ట్రాలు పద ఆ చివరి బెంచి మన కోసమే ఎదురుచూస్తుంది.

“అబ్బో”

మేము కూర్చున్న బెంచీపై ఎవడో మనస్సు విరిగిన మహానుభావుడు రాసాడిలా–

“నన్ను కాదని నాని వైపు కళ్ళు మారల్చావు నువ్వు! నువ్వు రావని పెన్నుని సిగిరెట్టుగా మలిచాను నేను”

అదృష్టవశాత్తు ఆ పిల్లి కళ్ళ మెరీనా నాకు సూటిగా కూర్చుంది..



“Good Morning Madam” అంటూ అందరూ లేచారు, కార్తీక్ తప్ప.

“ఏరా, అందరిలా లేచి నువ్వు కూడా good Morning చెప్పొచ్చుగా పొగరా, బలుపా?” అడిగాడు రాజు.

“లేదు నాకు పొద్దుటి నుండి అంత గొప్పగా ఏం జరగలేదు, నేను ఏది అంత సులువుగా చెప్పను అని నీకు తెలుసుగా.”

"మరీ ఎటకారంగా లేదు కార్తీక్ ఇది"

"నాకు లేదు. మెరీనా కళ్ళు, మా నాన్న నవ్వు, కింద ఒక అమ్మాయి గురించి తన్నుకునే ఆ నలుగురు నన్ను ఏది సంతోషపరచలేదు."

"ఆమె కళ్ళకు ఏమైందిరా బానే ఉన్నాయ్ అన్నావ్ కదరా"

"బానే ఉన్నాయ్ కానీ మా నాన్న ఊరుకోడుగా"

"నిన్న మేడం నీలిరంగు చీరలో చాలా అందంగా ఉంది కదరా రాజు.."

"కామాంధుడా.."

"అందంగా ఉంది అంటే – కామాంధుడా! అంటావా?"

"అబ్బా! పోరి కత్తిలా ఉందిరా! అన్న మాటకి, అబ్బా.. అమ్మాయి అందంగా ఉంది అన్నదానికి చాలా తేడా ఉందిరా ఎడ్డినాయాలా."

ఇద్దరి సంభాషణని చెడగొట్టి

"ఒరెయ్ చివరన ఉన్న ఇద్దరు సన్నాసులూ, ఏం చేస్తున్నారా? నిల్చోండి"

"వీడే ఏదో ? Philosophy వాగుతున్నాడు మేడం."

"ఏం లేదు మేడం, మీరు నిన్న శారీలో చాలా అందంగా ఉన్నారని చెప్పాను. దానికి వీడు ఏదేదో వాగితే సమాధానం ఇస్తున్నాను"

క్లాసులో మొత్తం 70 మంది. 30 మంది అబ్బాయిలు, 40 మంది అమ్మాయిలు. అంతా నన్ను ఆశ్చర్యంగా చూసారు అలా అనగానే.

అలా మాట్లాడగానే మేడం క్లాసు విడిచిపెట్టి ఏడుస్తూ బాల్కనిలోకి పరిగెత్తింది.

మేడం వెనకాలే "అయ్యో.. మేడం మేడం" అంటూ నేను పరిగెత్తాను.

"సారీ క్షమించండి మేడం. నేను ఉన్నదే చెప్పాను" అంటూ దగ్గరికెళ్ళి మేడం చెయ్యి లాక్కొని ఓ ముద్దు పెట్టాను. "మీరు నిజంగా చాలా అందంగా ఉంటారు మేడం. మీరు ఇలా ఏడిస్తే బాగుండదు. నామీద ఇప్పుడు మీరు కంప్లైంట్ ఇవ్వొచ్చు.